ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 22.11.2024 సమయం.13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు ప్రతి ఒక్కరూ దేశమే ముందు అనే భావనను అలవరుచుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు.
2. పదో షెడ్యూల్ ప్రకారం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర శాసన సభాపతికి హైకోర్టు సూచించింది.
3. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.
4. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

-----------------------------

**President Lok Manthan:**

భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు ప్రతి ఒక్కరూ దేశమే ముందు అనే భావనను అలవరుచుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కోరారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటయిన లోక్ మంథన్ నాల్గవ సంచికను రాష్ట్రపతి ఈ

ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రాచీన భారతీయ సంస్కృతి, భాష, కళలు, విజ్ఞానాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో భిన్న ప్రాంతాలలో భిన్న సాంప్రదాయాలు, రీతులు, కళలు, నైపుణ్యాలు ఉన్నా, వాటిని కలిపి ఉంచే ఏకత్వమే భారతీయత అని పేర్కొన్నారు.

**(Sound Byte- President )**

భారతీయత ప్రపంచం నలుమూలలా విస్తరించి ఎన్నోదేశాల సంస్కృతుల్లో భాగం అయిందని చెప్పారు. సంస్కృతీ, భాష, సాంప్రదాయ విజ్ఞానాలతో కూడిన ఈ భారతీయతను ఏకత, సమగ్రతలతో పునరుజ్జీవింపజేసి, ముందుతరాల కోసం పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు

అంతకుముందు, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ, భాష, సంస్కృతి, సాంప్రదాయం, అన్నిటిలోనూ విభిన్న రీతుల సమాహారమే భారతీయత అని పేర్కొన్నారు.

కేంద్ర మంత్రి G కిషన్ రెడ్డి మాట్లాడుతూ, వికసిత భారత్ లక్ష్య సాధనలో సవాళ్లకు లోక్ మంథన్ పరిష్కారాలను సూచించగలదని అభిప్రాయ పడ్డారు. గిరిజన, ఇతర జాతుల సాంస్కృతిక, జీవన విధానాల పరిరక్షణ కోసం పలు అంశాలను లోక్ మంథన్ లోతుగా చర్చిస్తుందని చెప్పారు.

రాష్ట్ర మంత్రి అనసూయ సీతక్క, RSS సర్ సంఘచాలక్ Dr మోహన్ భాగవత్, లోకమంథన్ జాతీయ కార్యదర్శి నంద కుమార్, లోక మంథన్ రాష్ట్ర అధ్యక్షులు హనుమాన్ చౌధరీ హాజరయినవారిలో ఉన్నారు.

**MSL**

--------------------------

**ఎమ్మెల్యేల అనర్హత**

బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఈ రోజు తీర్పు ఇచ్చింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై షెడ్యూలు ఖరారు చేయాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం కొట్టేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం, ఐదేళ్ల అసెంబ్లీ గడువును దృష్టిలో ఉంచుకొని, 10వ షెడ్యూల్ ప్రకారం అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని శాసనసభాపతికి సూచించింది. బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కె.పి.వివేకానంద్‌లు పిటిషన్లు దాఖలు చేశారు.

**డెస్క్**

------------------------

**ధాన్యం కొనుగోలు**

ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డితో కలసి ఆకస్మికంగా తనిఖీ

చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం దిగుబడి లభించే నల్లగొండ జిల్లాలో కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన తక్షణమే రైతులకు చెల్లింపులు చేస్తున్నామని మంత్రి తెలిపారు

**పీటీసీ నల్లగొండ**

------------------------

**రైతుల ఖాతాల్లో బోనస్**

నిజామాబాద్ జిల్లా రైతుల ఖాతాల్లో సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌ను జమ చేసినట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తొలి విడతగా 3,223 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 12 కోట్ల 52 లక్షల 43 వేల 400 నగదు జమ చేశామన్నారు.

**పీటీసీ, మంచిర్యాల**

--------------------------

**శ్రీధర్ బాబు**

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిన్న సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టిస్తున్నాయని మంత్రి విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజా సంక్షేమ పథకాల అమలులో వెనకడుగు వేసే

ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. పుణ్యక్షేత్రం ధర్మపురిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి అందజేసినట్లు శ్రీధర్ బాబు తెలిపారు.

**పీటీసీ, జగిత్యాల**

--------------------------------

**మావోయిస్టులు**

ములుగు జిల్లా వాజేడు మండలంలో మావోయిస్టులు ఈ రోజు ఇన్ఫార్మర్ నెపంతో పంచాయతీ కార్యదర్శి రమేశ్ తో పాటు మరో వ్యక్తిని హత్య చేశారు. సంఘటనా స్థలంలో మావోయిస్టు కమిటీ శాంత పేరిట లేఖను మావోయిస్టులు వదిలి వెళ్లారు.

**డెస్క్**

---------------------

**బీసీ కమీషన్**

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా వివిధ కులసంఘాల నుంచి బీసీ కమిషన్ కు 105 అభ్యర్థనలు అందాయి. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో నిన్న  తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థలలో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల గుర్తింపు పేర్కొనే అంశంపై ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, ఇతర కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు బహిరంగ విచారణ నిర్వహించగా

ప్రజల నుండి విశేష స్పందన వచ్చిందని బీసీ  డెడికేటెడ్ కమీషన్ ఛైర్మన్ వేంకటేశ్వర రావు తెలిపారు.

**పి టి సి, హన్మకొండ జిల్లా, వరంగల్ జిల్లా**

-------------------------

**జనగామ జిల్లాలో 99శాతం సర్వే పూర్తి**

జనగామ జిల్లాలో 99శాతం సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి అయినట్లు జనగామ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తెలిపారు. జిల్లాలో అందరూ తప్పని సరిగా సర్వే చేయించుకోవాలన్నారు. సమగ్ర ఇంటింటి సర్వే వివరాలు ఇవ్వని  గ్రామాల్లోని ప్రజలు పంచాయతీ సెక్రెటరీ ని సంప్రదించాలని, పట్టణ ప్రజలు మున్సిపాలిటీ వార్డ్ ఆఫీసర్ ను సంప్రదించి సహకరించాలన్నారు. ఒకటి రెండు రోజులలో సర్వే చేయించుకోవాలన్నారు.

**పీటీసీ, జనగామ**

----------------------------------------

**ఆసిఫాబాద్ జిల్లా**

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సేకరించిన సమాచారాన్ని ఆన్లైన్ లో నమోదు చేసే ప్రక్రియ జిల్లాలో ఈ రోజు నుండి ప్రారంభమైంది. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే పరిశీలించగా, ఆసిఫాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రక్రియను ఆర్డీవో లోకేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన

సమాచారాన్ని నిర్ణీత నమూనాలో పొందుపరచడం జరుగుతుందన్నారు. సమాచార సేకరణ ప్రక్రియ చివరి దశకు వచ్చిందని వివరించారు.

**పీటీసీ, ఆసిఫాబాద్**

------------------------------

**ఐఎండీ**

భారత వాతావరణ శాఖ 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ వాతావరణం, వాతావరణ సేవలపై హైదరాబాద్ లో వాతావరణ శాఖ అందించిన సేవలపై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ మెట్రో నగరాల్లో వాతావరణంలో మార్పులు ఎక్కువగా వస్తున్నాయని, హైదారాబాద్ లో 2 సెంటీమీటర్ల వర్షం పడితే నగరం మొత్తం మునిగే పరిస్థితి ఏర్పడిందన్నారు.

**పీటీసీ**

---------------------

**పత్తి కేంద్రాల సందర్శన**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ రోజు బీఆర్ఎస్ నేతలతో కలసి ఖమ్మం జిల్లాలోని పత్తి మార్కెట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు మాట తప్పిందన్నారు. రైతులకు ఎటువంటి బోనస్ చెల్లించడం లేదని ఆరోపించారు.

**పీటీసీ ఖమ్మం**

---------------------

**వైద్య కోర్సులు**

వైద్య కళాశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న పారా మెడికల్ కోర్సులు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్, డిప్లమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ గీతామాధురి తెలిపారు. ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సుకు ఈనెల 22న, డిప్లమా ఇన్ ఇమేజింగ్ టెక్నాలజీ కోర్సులో ఈనెల 23న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కౌన్సిలింగ్ కు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

**సంగారెడ్డి పీటీసీ**

------------------------

**ప్రచార దినాలు**

ఓటర్ జాబితా సవరణ 2025 లో భాగంగా ఈనెల 23, 24వ తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లాలో ఓటర్ల నమోదు, సవరణ కోసం ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. బూత్ స్థాయి అధికారులు రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ బూత్ ల వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు. జనవరి 1, 2025 నాటికి 18

సంవత్సరాలు నిండినవారు ఈ నెల 28 లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

**ఆసిఫాబాద్ జిల్లా పిటిసి**

------------------------------